నేటి మ్యాచ్ | గుజరాత్ X కోల్‌కతా | అహ్మదాబాద్ - రా. 7.30

# చెన్నై సేఫ్

**కీలక మ్యాచ్‌లో రాజస్థాన్‌పై గెలుపు**

**సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్**

**రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్**

**ఈ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే).. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పక రాణించాల్సిన మ్యాచ్‌లో జూలు విదిల్చింది. తమ సొంత డెన్ చెపాక్‌లో సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడిచేసిన రుతురాజ్ సేన.. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తడబడ్డా చివరికి గమ్యాన్ని ముద్దాడింది. ఈ గెలుపుతో చెన్నై.. ఏడు విజయాలతో 14 పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లింది.**


సిమర్‌జిత్ (3/26)

చెన్నై: ఐపీఎల్-17లో ఒడిదొడుకుల మధ్య సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ సూపర్ కింగ్స్.. ప్లేఆఫ్స్ రేసులో నిలిచేందుకు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన అత్యంత కీలకమ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ప్లేఆఫ్స్ బెర్తును పదిలం చేసుకుంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సిమర్‌జిత్ సింగ్ (3/26) ధాటికి రాజస్థాన్ టాపార్డర్ కుప్పకూలడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులకే పరిమితమైంది. రియాన్ పరాగ్ (35 బంతుల్లో 47 నాటౌట్, 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించాడు. స్వల్ప ఛేదనే అయినా చెన్నై కూడా ఛేదనలో తడబాటుకు లోనైంది. రుతురాజ్ గైక్వాడ్ (41 బంతుల్లో 42 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆ జట్టు 18.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది.

**సిమర్‌జిత్ సూపర్..**

చెపాక్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌ను నెమ్మదిగానే ఆరంభించింది. ప్రమాదకర బట్లర్ (21), జైస్వాల్ (24) క్రీజులో ఉన్నా పవర్ ప్లేలో ఆ జట్టు 42 పరుగులే చేయగలిగింది. ఏడో ఓవర్లో బంతిని అందుకున్న సిమర్‌జిత్.. రెండో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసి చెన్నైకి బ్రేక్ ఇచ్చాడు. తన రెండో ఓవర్లో బట్లర్‌ను బోల్తా కొట్టించిన సిమర్‌జిత్.. 15వ ఓవర్లో శాంసన్ (15) ను పెవిలియన్‌కు పంపాడు. మిడిల్ ఓవర్స్‌లో రాజస్థాన్ బ్యాటర్లు పరుగులు తీయడానికి నానా తంటాలు పడ్డారు. తీక్షణ, జడేజా, శార్దూల్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడిచేశారు. చివర్లో పరాగ్, ధ్రువ్ జురెల్ (18 బంతుల్లో 28, 1 ఫోర్, 2 సిక్సర్లు) మెరుపులతో రాజస్థాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

**చెన్నై కష్టంగానే..**

స్వల్ప ఛేదనను పూర్తిచేయడానికి చెన్నై కూడా తంటాలు పడింది. ఆరంభంలో రచిన్ రవీంద్ర (18 బంతుల్లో 27, 1 ఫోర్, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడినా అశ్విన్ వేసిన 3వ ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మిచెల్ ఉన్నది కొద్దిసేపే అయినా బౌండరీలతో మెరుపులు మెరిపించి చాహల్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆ తర్వాత నుంచి సీఎస్‌కే స్కోరు వేగం మందగించింది. మొయిన్ అలీ (10)తో పాటు రుతురాజ్ కూడా పరుగులు తీయడానికి ఇబ్బందిపడ్డారు. అశ్విన్ వేసిన 14వ ఓవర్లో 6, 4, 4 బాదిన దూబే (18) అదే ఓవర్లో ఆఖరి బంతికి రియాన్ పరాగ్ చేతికి చిక్కాడు. జడేజా (5) అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్ రూపంలో పెవిలియన్ చేరడంతో చెన్నై శిబిరంలో ఒకింత అలజడి రేగింది. కానీ రుతురాజ్ అండతో రిజ్వీ (8 బంతుల్లో 15 నాటౌట్, 3 ఫోర్లు) లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

**రాజస్థాన్:** 20 ఓవర్లలో 141/5 (రియాన్ 47, జురెల్ 28, సిమర్‌జిత్ 3/26, తుషార్ 2/30). **చెన్నై:** 18.2 ఓవర్లలో 145/5 (రుతురాజ్ 42 నాటౌట్, రచిన్ 27, అశ్విన్ 2/35, బర్గర్ 1/21)

## దీక్ష సరికొత్త రికార్డు



ఢిల్లీ: భారత ట్రాక్ అథ్లెట్ కేఎం దీక్ష మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్ట్‌లో భాగంగా శనివారం ముగిసిన ఫైనల్ రేసును 4:4.78 నిమిషాలలో పూర్తిచేసిన దీక్ష మూడో స్థానంలో నిలిచింది. 2021లో హర్మిలన్ బెయిన్స్ నెలకొల్పిన 4:05.39 నిమిషాల రికార్డును బ్రేక్ చేసింది. ఇదే టోర్నీలో మహిళల 5 వేల మీటర్ల రేసును పారుల్ చౌదరి 15:10.69 నిమిషాల్లో పూర్తి చేసి ఐదో స్థానం దక్కించుకుంది. పురుషుల 5 వేల మీటర్ల రేసులో అవినాష్ సాబ్లె.. 13:19.30 నిమిషాల్లో పూర్తిచేసి పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

## రిటైర్మెంట్ ప్రకటించిన సీన్ విలియమ్స్

ఢాకా: జింబాబ్వే స్టార్ ఆల్‌రౌండర్ సీన్ విలియమ్స్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. బంగ్లాదేశ్‌తో ఢాకా వేదికగా జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌తో అతడు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. జింబాబ్వే తరఫున 81 టీ20లు ఆడిన విలియమ్స్.. 1697 పరుగులు చేసి బంతితో 48 వికెట్లు పడగొట్టాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా వన్డేలు, టెస్టులలో మాత్రం అతడు కొనసాగనున్నాడు.

## పర్వేజ్ ఖాన్‌కు స్వర్ణం



ఫ్లోరిడా: భారత యువ అథ్లెట్ పర్వేజ్ ఖాన్ ఫ్లోరిడా వేదికగా జరుగుతున్న సౌత్‌ఈస్టర్న్ కాన్ఫరెన్స్ ఔట్‌డోర్ ట్రాక్ అండ్ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచాడు. పురుషుల 1500 మీటర్ల రేసును పర్వేజ్.. 3 నిమిషాల 42.73 నిమిషాల్లోనే పూర్తిచేసి పసిడి నెగ్గాడు. హర్యానాలోని మేవాత్ జిల్లా చహల్కా గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన 19 ఏండ్ల కుర్రాడు.. ఇదే టోర్నీ 800 మీటర్ల రేసులో కాంస్యం సాధించాడు.

# ఢిల్లీ ఔట్

**క్యాపిటల్స్ ప్లేఆఫ్స్ ఆశలపై నీళ్లు చల్లిన బెంగళూరు**

**రాణించిన పాటిదార్, జాక్స్**

**ఐదో స్థానానికి ఆర్సీబీ**

**ప్లేఆఫ్స్ రేసులో ముందంజ వేసి నాకౌట్ ఆశలు నిలుపుకోవాల్సిన కీలకపోరులో చేతులెత్తేసిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఆ రేసు నుంచి తప్పుకున్నట్టే! ఆదివారం 'చిన్నస్వామి' వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ బంతితో పాటు బ్యాట్‌తోనూ తడబడి మూల్యం చెల్లించుకుంది. సమిష్టి ప్రదర్శనతో వరుసగా ఐదో విజయం అందుకున్న బెంగళూరు.. 6 విజయాలు 12 పాయింట్లతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.**


రజత్ (52)

బెంగళూరు: ఐపీఎల్-17 ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తప్పటడుగులు వేసి తగిన మూల్యం చెల్లించుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. 47 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. రజత్ పాటిదార్ (32 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్సర్లు), విల్ జాక్స్ (29 బంతుల్లో 41, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులతో 20 ఓవర్లలో 187/9 పరుగులు చేసింది. ఛేదనలో ఢిల్లీ.. 19.1 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. అక్షర్ పటేల్ (39 బంతుల్లో 57, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో యశ్ దయాల్ (3/20), ఫెర్గూసన్ (2/23) రాణించారు. కామెరూన్ గ్రీన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**మిడిలార్డర్ జోరు**

ఆర్సీబీ సారథి ఫాఫ్ డుప్లెసిస్ (6) మరోసారి నిరాశపరచగా కోహ్లీ (13 బంతుల్లో 27, 1 ఫోర్, 3 సిక్సర్లు) దూకుడుగా ఆడినట్టే అనిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. 36 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని జాక్స్, పాటిదార్ ఆదుకున్నారు. ఢిల్లీ ఫీల్డర్లు ఈ ఇద్దరూ ఇచ్చిన క్యాచ్‌లను నేలపాలు చేయడం వారికి కలిసొచ్చింది. 29 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న పాటిదార్.. రసిక్ 13వ ఓవర్లో అక్షర్ పటేల్‌కు క్యాచ్ ఇవ్వడంతో 88 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆఖర్లో గ్రీన్ (24 బంతుల్లో 32 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు.

**ఢిల్లీ ఏ దశలోనూ..**

ఢిల్లీ ఆదినుంచే తడబడింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన డేవిడ్ వార్నర్ (1) నాలుగో బంతికే ఔట్ అయ్యాడు. జేక్ ఫ్రేజర్ (13 బంతుల్లో 27, 1 ఫోర్, 3 సిక్సర్లు) ఎప్పటిలాగే దూకుడుగా ఆడాడు. కానీ దురదృష్టవశాత్తూ యశ్ ఠాకూర్ 3వ ఓవర్ రెండో బంతికి రనౌట్ అయ్యాడు. పొరెల్ (2) ఫెర్గూసన్ చేతికి చిక్కాడు. కుశాగ్ర (2) ను సిరాజ్ ఎల్బీడబ్ల్యూ చేశాడు. దయాల్ 5వ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి ఊపు మీద కనిపించిన షై హోప్ (29)ను ఫెర్గూసన్ వెనక్కి పంపాడు. ఢిల్లీ భారీ ఆశలు పెట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ (3) రనౌట్ అవడంతో ఆ జట్టు 90 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖరారుచేసుకుంది. కానీ తాత్కాలిక సారథి అక్షర్ పటేల్ మెరుపులతో ఆ జట్టు ఓటమి అంతరం కొంత తగ్గింది.

### సంక్షిప్త స్కోర్లు

**బెంగళూరు:** 20 ఓవర్లలో 187/9 (రజత్ 52, జాక్స్ 41, రసిక్ 2/23, ఖలీల్ 2/31) . **ఢిల్లీ:** 19.1 ఓవర్లలో 140 (అక్షర్ 57, షై హోప్ 29, దయాల్ 3/20, ఫెర్గూసన్ 2/23)

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 12 | 9 | 3 | 1.42 | 18 |
| రాజస్థాన్ | 12 | 8 | 4 | 0.34 | 16 |
| చెన్నై | 13 | 7 | 6 | 0.52 | 14 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 0.40 | 14 |
| బెంగళూరు | 13 | 6 | 7 | 0.38 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | -0.48 | 12 |
| లక్నో | 12 | 6 | 6 | -0.76 | 12 |
| గుజరాత్ | 12 | 5 | 7 | -1.06 | 10 |
| ముంబై | 13 | 4 | 9 | -0.27 | 8 |
| పంజాబ్ | 12 | 4 | 8 | -0.42 | 8 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## జొకోకు షాక్



రోమ్: ఇటాలియన్ ఓపెన్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) కూడా రఫెల్ నాదల్ బాటలోనే నడిచాడు. రోమ్ వేదికగా ఆదివారం ముగిసిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో జొకో.. 2-6, 3-6 తేడాతో 29వ సీడ్ చిలీ ఆటగాడు అలెజండ్రో తబిలో చేతిలో చిత్తుగా ఓడాడు. ఇదే టోర్నీలో రెండ్రోజుల క్రితమే నాదల్.. మూడో రౌండ్‌లోనే వెనుదిరిగిన విషయం విదితమే.

## ఇస్తాంబుల్‌లోనూ అదే కథ

**రెండు బెర్తులతోనే సరిపెట్టుకున్న రెజ్లర్లు**

ఇస్తాంబుల్: వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలోనూ భారత రెజ్లర్ల వైఫల్య ప్రదర్శన కొనసాగింది. పారిస్ ఒలింపిక్స్ బెర్తులను నిర్ణయించే ఈ టోర్నీలో భాగంగా ఆఖరి రోజైన ఆదివారం బరిలోకి దిగిన ఇద్దరు ఫ్రీస్టయిల్ రెజ్లరూ ఓడారు. పురుషుల 65 కిలోల విభాగం కాంస్య పోరులో సుజీత్.. జైన్ అలెన్ చేతిలో ఓడాడు. 74 కిలోల రెపిచెజ్ రౌండ్‌లో జైదీప్.. అర్సలన్ (టర్కీ)కు తలవంచాడు. కొద్దిరోజుల క్రితమే బిష్కెక్ వేదికగా ముగిసిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో చేతులెత్తేసిన మన మల్ల యోధులు.. ఈ టోర్నీలోనూ అదే వైఫల్యాన్ని కొనసాగించారు. నిషా దహియా (68 కిలోలు), అమన్ సెహ్రావత్ (57 కిలోలు) మాత్రమే రాణించారు. ఈ ఇద్దరితో పాటు ఇప్పటివరకు వినేశ్ ఫొగాట్, అంతిమ్ పంఘల్, అన్షు మాలిక్, రీతికా హుడా ఒలింపిక్ బెర్తులు దక్కించుకున్నారు.




## SMARTగా ఆలోచించండి

- **S - Selective :** మీకున్న సామర్థ్యాలను తెలుసుకొనే లక్ష్యాలను ఎంచుకోండి. అప్పుడే వాటిని సులువుగా సాధించవచ్చు.
- **M - Measurable:** ఆర్థిక లక్ష్యాల సాధనకు క్రమశిక్షణతో ముందుకు కదలండి. ప్రణాళికాబద్ధమైన పొదుపుతో గెలుపు మీ సొంతం.
- **A - Achievable :** ప్రతీ గమ్యాన్ని చేరడానికి ఓ మార్గం అంటూ ఉంటుంది. దాన్ని గుర్తిస్తే సులభంగా జయించవచ్చు.
- **R - Realistic :** వాస్తవ పరిస్థితులను మరువద్దు. మీ ఆదాయం, ఖర్చులు, వనరులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోండి.
- **T - Time-bound:** ప్రతీ లక్ష్య సాధనకూ ఓ నిర్దిష్ట సమయాన్ని కేటాయించుకోండి. తద్వారా దానిపై దృష్టి సారించండి.

*ఈ S.M.A.R.T. విధానంతో మీ లక్ష్యాలను క్రియాశీలకంగా, సాధించేవిగా మార్చుకోవచ్చు.*

## అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం

**మార్కెట్ పల్స్**

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే సాగాయి. కేవలం చివరిరోజే లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఓవరాల్‌గా మదుపరులు.. లాభాల స్వీకరణకే మొగ్గు చూపారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,213.68 పాయింట్లు క్షీణించి 72,664.47 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 420.65 పాయింట్లు పడిపోయి 22,055.20 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా మదుపరులు అమ్మకాల ఒత్తిడినే ఎదుర్కోవచ్చన్న అంచనాలున్నాయి. దేశవ్యాప్తంగా విడుతలవారీగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల సరళిని చూసి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు డైలమాలో పడ్డారని, పెట్టుబడుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. కేంద్రంలో ఎవరు అధికారంలోకి వస్తారనేదానిపై స్పష్టత కొరవడటమే కారణంగా వారు పేర్కొంటున్నారు. ఇందులోభాగంగానే గత వారం నష్టాలను దీనికి ఉదాహరణగా చూపుతున్నారు. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక నిఫ్టీకి 21,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 21,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 22,300-22,500 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

## క్రెడిట్ కార్డుకూ ఓ లెక్కుంది..




**క్రెడిట్ కార్డుల వినియోగదారులు ఏటేటా పెరుగుతూపోతున్నారు. దీంతో వీరిని ఆకట్టుకునేందుకు అనేక బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్‌ఫైనాన్స్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. మార్కెట్‌లో లభిస్తున్న టాప్ క్రెడిట్ కార్డులను ఒక్కసారి పరిశీలిస్తే..**

**క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డులు**

ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్బీఐతో పాటు ప్రధాన ప్రైవేట్ రంగ, విదేశీ బ్యాంకులు అందించే క్రెడిట్ కార్డులపై ఆకర్షణీయ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉంటున్నాయి. ఈ క్రెడిట్ కార్డుల వినియోగదారులు ఆన్‌లైన్ షాపింగ్‌పై, ఇంధన కొనుగోళ్లపై 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, అంతకుమించి క్యాష్ పాయింట్లను పొందవచ్చు.

**ఈ-కామర్స్ క్రెడిట్ కార్డులు**

ఈ-కామర్స్ లావాదేవీల కోసం కూడా వివిధ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు రకరకాల క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. వీటి వినియోగదారులు క్యాష్‌బ్యాక్‌తో పాటు, లాంజ్ యాక్సెస్, వార్షిక చార్జీలపై తగ్గింపు ప్రయోజనాలను అందుకోవచ్చు. అమెజాన్, బుక్‌మైషో వంటి సంస్థల నుంచి వోచర్లు తీసుకోవచ్చు.

**ఎంటర్‌టైన్‌మెంట్ క్రెడిట్ కార్డులు**

క్రెడిట్ కార్డుల వినియోగదారుల వినోదం కోసం ఉద్దేశించబడినవే ఈ కార్డులు. ఆయా బ్యాంకులు ప్రముఖ మల్టీప్లెక్స్‌ల్లో తమ కస్టమర్లకు ఉచిత టికెట్లు వచ్చేలా ఆఫర్లు ఇస్తున్నాయి. గిఫ్ట్ వోచర్లు, రివార్డు పాయింట్లనూ అందిస్తున్నాయి.

**ఫ్యూయల్ క్రెడిట్ కార్డులు**

ఇంధన కొనుగోళ్లపై ఈ ఫ్యూయల్ క్రెడిట్ కార్డు వినియోగదారులు లాభం పొందవచ్చు. వార్షిక వినియోగంపై రూ.5,000 వరకు ఆదా అయ్యేలా రకరకాల ప్లాన్లను అందుబాటులో ఉంచుతున్నాయి. పర్యాటకులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

**ట్రావెల్ క్రెడిట్ కార్డులు**

పర్యాటకులకు విమానాల్లో, ఏసీ రైళ్లలో వివిధ సౌకర్యాలను ఇవి అందిస్తాయి. ఈ క్రెడిట్ కార్డులను వాడేవారికి విదేశాల్లో చేసే ఖర్చులపై ప్రత్యేక రివార్డు పాయింట్లు అందుతాయి. విమానాశ్రయాల్లో లాంజ్ యాక్సెస్ కూడా ఉంటుంది.

**ఫైన్ డైన్-ఇన్ క్రెడిట్ కార్డులు**

హోటళ్లకు వెళ్లినప్పుడు ఈ ఫైన్ డైన్-ఇన్ క్రెడిట్ కార్డులు సౌకర్యవంతంగా, లాభదాయకంగా ఉంటాయి. అలాగే స్విగ్గీ తదితర ఫుడ్ ఆర్డర్ యాప్‌లలో ఆర్డర్లపై క్యాష్‌బ్యాక్‌తోపాటు వివిధ ఖర్చులపై రివార్డులు, బోనస్‌లను అందుకోవచ్చు.

**క్లబ్ మెంబర్‌షిప్ క్రెడిట్ కార్డులు**

ఆయా బ్యాంకులు తమ వినియోగదారులకు క్లబ్ మెంబర్‌షిప్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నాయి. విలాసవంతమైన క్లబ్బుల్లో ఏడాదిపాటు ప్రోత్సాహక సభ్యత్వాలనూ కల్పిస్తున్నాయి.

**లాంజ్ యాక్సెస్ క్రెడిట్ కార్డులు**

ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లలో ఈ క్రెడిట్ కార్డులున్నవారికి లాంజ్ యాక్సెస్‌లుంటాయి. రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్‌లు, గిఫ్ట్ వోచర్లూ అదనంగా లభిస్తాయి. ప్రయాణికులకు లాభసాటి.

**చివరగా..**

క్రెడిట్ కార్డులను పరిమితంగా, తెలివిగా వాడుకుంటే ఎన్ని ప్రయోజనాలో.. అదుపు తప్పితే అన్ని నష్టాలు. ముఖ్యంగా మీ క్రెడిట్ స్కోర్‌ను చాలా ప్రభావితం చేస్తాయివి. కాబట్టి అనవసరంగా క్రెడిట్ కార్డులను వాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోవద్దు. అలాగే క్రెడిట్ కార్డుకున్న పరిమితిలో 70 శాతాన్ని మించి వినియోగించకపోవడమే శ్రేయస్కరం. సమయానుసారంగా బిల్లులు చెల్లించడం మరువద్దు.

## రియల్టీలో ఇన్వెస్ట్ చేస్తారా?



**మదుపరులు** తీసుకునే నిర్ణయాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులే పెద్దది. రియల్టీలో పెట్టుబడులు పెడుతున్నప్పుడు.. దానిపై ఆకర్షణీయమైన రాబడులు వచ్చేలా చూసుకోవాలి. నిజానికి స్థిరాస్తిపై మీరు పెట్టుబడులకు వెళ్లకపోతే దీర్ఘకాలంలో మీ సంపద వృద్ధి లేనట్టేననుకోవచ్చు. కాబట్టి సరైన ప్రాపర్టీలో పెట్టుబడులే మీ కెరియర్‌లో కీలకం. ప్రస్తుతం దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ లాభదాయకంగానే ఉందని చెప్పుకోవచ్చు. కరోనా సమయంలో తీవ్రంగా ప్రభావితమైన ఈ రంగం.. ఇప్పుడు దాదాపుగా పూర్తిస్థాయిలో కోలుకున్నది. ఇక రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారు ఇలా ముందుకెళ్లండి.

**ప్రాంతమే కీలకం**

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టాలనుకున్నప్పుడు.. ప్రాంతమే అత్యంత కీలకం. ఏరియా, లొకేషన్లనుబట్టే రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్లలో రాబడులపై ఓ అంచనాకు రావచ్చు మరి. అందుకే స్థలమైనా, ఇండిపెండెంట్ హౌజ్ అయినా, అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటైనా.. ప్రాపర్టీ లొకేషన్ చాలా చాలా ముఖ్యం. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, దవాఖానలు ఇలా అన్ని సదుపాయాలుంటే ఉత్తమం. ధర ఎక్కువైనాసరే ఇక్కడే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపండి. దీనివల్ల మీ పెట్టుబడికి వేగవంతమైన లాభాలు రాగలవు. అద్దెకు ఇవ్వాలన్నా ఇలాంటి ఏరియాల్లోనే డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. భవిష్యత్తులో అమ్ముకున్నా ఇట్టే అమ్ముడుపోతుంది. ఇక దీర్ఘకాలిక ఇన్వెస్ట్‌మెంట్లకు దిగేవారు.. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను ఎంచుకోవచ్చు. నగర శివార్లను కూడా పరిశీలించవచ్చు. ఇక్కడ ధరలు కూడా తక్కువగా ఉంటాయి.

**ప్రాపర్టీ రకం**

రియల్టీ మదుపరులు తాము కొనే ప్రాపర్టీపైనా ఓ స్పష్టమైన అవగాహనను కలిగి ఉండటం చాలాచాలా అవసరం. పూర్తయిన ప్రాజెక్టుల్లో కొనాలా? లేదా రీసేల్ లేక నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీలా? కాదంటే ఓపెన్ ప్లాట్స్ తీసుకోవాలా? అన్నదానిపై ముందే స్పష్టతను తెచ్చుకోవడం ఉత్తమం. పూర్తయిన ప్రాజెక్టుల్లోకి వెళ్తే.. ఆలస్యం ఉండదు. వెంటనే మన ఆస్తిని మనం దక్కించుకోవచ్చు. అలాకాకుండా నిర్మాణంలో ఉన్న ఇంటిని లేదా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను తీసుకుంటే ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. బిల్డర్లు ఆలస్యం చేస్తే నష్టపోయే ప్రమాదం ఉన్నది. అయితే బిల్డర్లు సరైనవారే అయితే మాత్రం లాభాలూ ఉంటాయి. నిర్మాణానికి వినియోగించే ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించవచ్చు. మనకు నచ్చినట్టు ఇంటీరియర్ డిజైన్ చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుంది. కానీ ఇందుకు కొంత సొమ్మును అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

**డాక్యుమెంట్లు**

దళారీల ద్వారానైనా, నమ్మకస్తుల ద్వారానైనా స్థిరాస్తులు కొంటున్నప్పుడు డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ప్రాపర్టీ ఎలా ఉన్నా.. డాక్యుమెంట్లు సరిగా లేకపోతే మన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరేనని గుర్తుంచుకోవాలి. డబుల్ రిజిస్ట్రేషన్, అనుమతులు లేకపోవడం వంటివి ఇన్వెస్టర్లకు పెద్ద తలనొప్పే. ప్రతీచోటా ఈసీలు తెచ్చుకోవాల్సి ఉంటుంది. లేకపోతే రుణాలు దొరకవు. దొరికినా అధిక వడ్డీలతో తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఇక లీగల్ ఇష్యూస్ ఎదురైతే వాటి నుంచి బయటపడటం అంత ఆషామాషీ కాదు. కనుక ఏదైనా స్థలం లేదా ఇల్లు, ఫ్లాట్లు కొనేముందే వాటి పత్రాలను చూడాలి. న్యాయ నిపుణులను సంప్రదించి వారి సలహాలను కూడా తీసుకోవడం ఉత్తమం. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు తీసుకుని మోసపోయినవారెందరో ఉన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాజెక్టులు వచ్చే చోట, ప్రభుత్వ స్థలాలు కొనుక్కుని కూడా మోసపోయారు. అందుకే ఈ విషయంలో జాగ్రత్త చాలాచాలా అవసరం.

**పెట్టుబడి ఉద్దేశం**

రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు దిగే ముందు మన లక్ష్యాలను తెలుసుకోవాలి. కేవలం పెట్టుబడి పరంగానే చూస్తున్నామా? లేక భవిష్యత్తులో అక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకునే ఉద్దేశం ఏమైనా ఉందా? కాదంటే అద్దెకు ఇచ్చుకుని దానిపై వచ్చే ఆదాయాన్ని తీసుకోవాలనుకుంటున్నామా? అన్నదానిపై ఇన్వెస్టర్‌కు అవగాహన అవసరం. పెట్టుబడి కోసమే అయితే తక్కువ ధరతో దీర్ఘకాల పెట్టుబడులకు వెళ్లవచ్చు. దూరమైనాసరే ఏదో ఒక వెంచర్‌లో అన్నింటినీ గమనించి ఓ నిర్ణయం తీసుకోవచ్చు. అలాకాకుండా నిర్ణీత వ్యవధి అనంతరం స్థిర నివాసానికి ప్లాన్ చేసుకోవాలనుకుంటే.. పరిసరాల్ని పరిశీలించాలి. భవిష్యత్తులో



రవాణాప రంగా, విద్య, వైద్యసదుపాయాలుండేలా చూసుకోవాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవు. అపార్ట్‌మెంట్ ఫ్లాటైతే.. ఆ భవనం వయసు, అనుమతులు, పార్కింగ్, త్రాగునీటి సరఫరా, చుట్టూ ఉన్నవారిని కూడా గమనించడం అవసరం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.